


రంజాన్ వేళలు
ఇఫ్తార్ (శుక్ర) సా.6.24
సహరీ (శని) ఉ.4.38

ఎండా కాలమ్
గరిష్ఠం కనిష్ఠం
అమలాపురం 32 26



ఆత్రేయపురం అగ్రహారంలో కుళాయి కనెక్షన్‌ను రోడ్డుపై పడేసిన దృశ్యం

ఇంటింటికీ కుళాయిలు వేసి తాగునీరు అందించాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా తలపెట్టిన 'జల జీవన్ మిషన్' పథకం ఆదిలోనే అభాసుపాలవుతోంది. శివారు ప్రాంతాల ప్రజలకు ఈ వేసవిలోనూ తాగునీటి ఇక్కట్లు తప్పేలా లేదు. లక్ష్యం నెరవేరకపోగా వాటర్ ప్లాంట్లలో నీరు కొనుక్కుని తాగాల్సిన పరిస్థితి నెలకొంది.



ఆత్రేయపురంలో ఓ ఇంట్లో ఏర్పాటుచేసిన కుళాయి... దీంట్లొంచి చుక్కనీరొస్తే ఒట్టు

# జలజీవనమేదీ!

- జలజీవన్ మిషన్ కింద జిల్లాకు రూ.515 కోట్లు మంజూరు
- 1,834 పనులు మంజూరు... 915 పూర్తి
- సామాన్యులకు కుళాయిల ద్వారా అందని తాగునీరు
- ఈ వేసవిలోనూ శివారు ప్రాంతాల్లో ఇక్కట్లే!

ఆత్రేయపురం, మార్చి 28: జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని 22 మండలాల పరిధిలోని 1,348 శివారు ప్రాంతాల్లో రూ.515 కోట్లతో 1,834 పనులు చేపట్టేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. కాంట్రాక్టర్లు ఏడాది నుంచీ ఈ పనులు చేస్తున్నారు. ఇప్పటివరకు సుమారు 915 పనులు పూర్తయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం వాటాను పీఈఎంఎస్ ఖాతాలో జమ చేయాలి. ఆ తర్వాత కేంద్రం మరో 50 శాతం నిధులను అదే ఖాతాలో జమ చేస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో నిధులు జమ చేయకపోవడంతో కాంట్రాక్టర్లు ముందుకు రాక మిగతా పనులు నిలిచిపోయినట్టు తెలుస్తోంది.




ఆత్రేయపురంలో మూలన పడి ఉన్న జలజీవన్ మిషన్ పైపులు

కొత్తపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 223 పనులకు రూ.102.8 కోట్లు మంజూరయ్యాయి. ఇందులో 50 పనులు పూర్తికాగా మిగతా 80 నత్తనడకన సాగుతున్నాయి. 93 పనులను అసలు మొదలుపెట్టలేదు. పూర్తయిన పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు చెతులెత్తేశారు. ఆత్రేయపురం మండలంలోని 17 గ్రామాల్లో 33 శివారు ప్రాంతాలకు రూ.19కోట్లు మంజూరయ్యాయి. తొమ్మిదిచోట్ల పనులు పూర్తికాగా మిగిలినవి నిలిచిపోయాయి. దీంతో ఇంటింటికీ తాగునీరు అందించాలనే లక్ష్యం నీరుగారుతోంది.

## ఇష్టారాజ్యంగా పనులు...

జలజీవన్ మిషన్ పనులను నాసిరకంగా చేస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ పనులపై ముందుగా ప్రజలకు అవగాహన కల్పించాల్సి వుంది. నాసిరకం పైపులైన్లు వేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అధికారుల పర్యవేక్షణ కూడా కొరవడిందంటున్నారు. కుళాయిలకు కాంక్రీట్ దిమ్మలు ఏర్పాటు చేయాల్సి ఉంది. చాలాచోట్ల కుళాయిలను ఇళ్ల ముందే పడేశారు. కొన్నిచోట్ల ఇంటి గోడలకు కుళాయి కనెక్షన్లు ఏర్పాటుచేసినా చుక్క నీరు కూడా రాని పరిస్థితి. పర్యవేక్షణ కొరవడడంతో పైపులైన్లు లీకవుతున్నాయి.



ఉచ్చిలిలో అలంకారప్రాయంగా రక్షిత మంచినీటి పథకం



వీవీ ప్యాట్ పనితీరును పరిశీలిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా


# పోలింగ్‌లో ప్రిసైడింగ్ అధికారి పాత్ర కీలకం

- కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం టౌన్, మార్చి 28: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పోలింగ్ రోజున ప్రిసైడింగ్ అధికారి పాత్ర అత్యంత కీలకమని కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు మూడో రోజు శిక్షణను గురువారం కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో పురపాలక, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్, ఆర్‌డబ్ల్యుఎస్, ఆడిట్, జలవనరులశాఖ, అయినవిల్లి, ఆలమూరు గ్రామ వార్డు సచివాలయ సహాయకులతో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ ప్రిసైడింగ్ అధికారులు వారికి ఇచ్చిన హ్యాండ్ బుక్‌ను క్షుణ్ణంగా చదివి అందులోని అంశాలను అర్థం చేసుకోవాలన్నారు. పోలింగ్‌కు ముందురోజు మెటీరియల్ పంపిణీ కేంద్రానికి చేరుకుని రిటర్నింగ్ అధికారులను కలవాలన్నారు. పోలింగ్ కేంద్రానికి కేటాయించిన ఇతర పోలింగ్ సిబ్బంది, సూక్ష్మ పరిశీలకులు, వెబ్ కాస్టింగ్ సిబ్బందిని కలుసుకుని అదే రోజు రాత్రికి పూర్తిస్థాయి మెటీరియల్‌తో పోలింగ్ కేంద్రానికి చేరుకోవాలన్నారు. పోలింగ్ సిబ్బందికి ప్రత్యేకంగా కేటాయించిన బస్సుల్లోనే సెక్యూరిటీ సిబ్బందితో కలిసి వెళ్లాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ సొంత వాహనాలపై పోలింగ్ కేంద్రానికి వెళ్లరాదన్నారు. కేంద్రం వద్ద పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితా, పోలింగ్ కేంద్రానికి సంబంధించి ఓటర్ల సంఖ్యను తెలిపే గోడపత్రికను ప్రవేశ ద్వారం వద్ద ప్రదర్శించాలన్నారు. పోలింగ్ సమయం ముగిసే సమయానికి వరుసలో ఉన్న ఓటర్లలో చివర ఓటరుకు 1వ నంబరు, మొదటి వ్యక్తికి చివరి నంబరు ఇవ్వాలన్నారు. భౌతిక శిక్షణలో భాగంగా ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లను కలెక్టర్ పరిశీలించారు. శిక్షణ నోడల్ అధికారి, డీఆర్‌డీఏ పీడీ వి.శివశంకరప్రసాద్, మాస్టర్ ట్రైనర్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



# ఈ రంగులేమిటో!



మండపేట, మార్చి 28: సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చి 15 రోజులు కావస్తోంది. అయినా కొన్నిచోట్ల ఇంకా అధికార పార్టీ రంగులే కనిపిస్తున్నాయి. మండపేట లోని టిడ్కో గృహాల సముదాయంలోని మంచినీటి ట్యాంకు, వాటర్ వర్క్స్ ఆవరణలో చెత్త తరలించే ఆటోల రంగులు అధికారులకు కనిపించినట్టు లేదు.

## పదో తరగతి సంస్కృతం పరీక్ష ప్రశాంతం

ముమ్మిడివరం, మార్చి 28: జిల్లాలో పదో తరగతి సంస్కృతం పరీక్ష గురువారం ప్రశాంతంగా ముగిసింది. 42 పరీక్షా కేంద్రాల్లో 2,109 మంది విద్యార్థులకు 2,096 మంది హాజరయ్యారు. 13 మంది గైర్హాజరైనట్టు డీఈవో ఎం.కమలకుమారి తెలిపారు. డీఈవో మూడు, అసిస్టెంట్ కమిషనరు ఎస్.సురేష్ మూడు, డీవైఈవో ఎస్.ఫణి మూడు కేంద్రాలను పరిశీలించారు. ఎక్కడా మాస్ కాపీయింగ్, మాల్ ప్రాక్టీసు జరగలేదని డీఈవో చెప్పారు.

## బైబిళ్లు పంపిణీ చేసిన వలంటీర్ల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అమలాపురం రూరల్, మార్చి 28: వైసీపీ నాయకుడు, చర్చి పాస్టర్‌తో కలిసి సమనస గ్రామంలో వలంటీర్లుగా పని చేస్తున్న మోకా వెంకన్నబాబు, ఉడుము ప్రసాదరావు మత ప్రచారంలో భాగంగా కామనగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో విద్యార్థులకు బైబిళ్లు పంపిణీ చేశారు. ఈ వ్యవహారంపై గురువారం 'ఆంధ్రజ్యోతి'లో వార్త ప్రచురితమైంది. దీంతో ఆ ఇద్దరు వలంటీర్లను విధుల నుంచి తొలగిస్తూ అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో జి.కేశవర్ధనరెడ్డి ఎంపీడీవోకు ఉత్తర్వులు జారీ చేశారు. తక్షణం వారిని విధుల నుంచి తొలగించి ప్రభుత్వపరంగా అందించిన మెటీరియల్‌ను స్వాధీనం చేసుకోవాలని సూచించారు.

# ఓటరుగా నమోదుకు ఎన్నో మార్గాలు

అమలాపురం టౌన్, మార్చి 28: ఐదేళ్లకోసారి వచ్చే ఓటు అవకాశాన్ని యువత వదులుకోవద్దని కలెక్టర్ హిమాన్షు శుక్లా సూచించారు. ఓటరుగా నమోదు చేసుకునేందుకు నేడు ఎన్నో మార్గాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఓటు హక్కు పొంది సమర్థవంతమైన నాయకులను ఎన్నుకుని దేశ, రాష్ట్ర ప్రగతిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. స్వీప్‌లో భాగంగా ఓటర్లలో చైతన్యం తీసుకువచ్చేందుకు ప్రత్యేక కార్యక్రమాలు,ర్యాలీలు నిర్వహిస్తున్నామన్నారు. 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందడంతో పాటు చుట్టుపక్కల వారిని చైతన్యపరిచి ఓటు హక్కుపై మరింత అవగాహన పెంపొందించాలన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచి ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేలా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు వివరించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని విధిగా పాటించాలన్నారు. ఓటును నగదుకు, బహుమతులకు అమ్ముకోవడం నేరమని, ప్రతి ఒక్కరూ నైతికతతో ఓటు వేయాలన్నారు. సీ-విజిల్ యాప్‌ను వినియోగించి ఎన్నికల ఉల్లంఘనలపై ఫిర్యాదు చేయవచ్చని కలెక్టర్ హిమాన్షు శుక్లా చెప్పారు.



ట్రాక్టరులో మట్టి రవాణా చేస్తున్న దృశ్యం

# గుట్టుచప్పుడు కాకుండా!

- సీఆర్‌జెడ్ పరిధిలో మట్టి అక్రమ తవ్వకాలు
- రాత్రికి రాత్రే 200 ట్రక్కుల మట్టి తరలింపు
- చూసీచూడనట్టు అధికారులు

కాట్రేనికోన, మార్చి 28: మండలంలోని నడవపల్లి పల్లిపాలెం, పల్లంకుర్రు మధ్యలో ఏటిగట్టు పక్కన గోదావరి నదీ పరివాహక ప్రాంతంలో మట్టి అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. గురువారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో ఈ దందా మొదలైంది. ట్రక్కు రూ.1,200 చొప్పున 200 ట్రక్కుల మట్టిని సుమారు పది ట్రాక్టర్లలో పకడ్బందీగా రవాణా చేశారు. కుండలేశ్వరంలో ఇటుక బట్టీలకు, ఆలయం వెనుక వున్న ఒక స్థలాన్ని మెరక చేసేందుకు ఈ మట్టిని తరలించినట్టు సమాచారం. మద్రాసు కన్జర్వెన్సీ చట్ట ప్రకారం సీఆర్‌జెడ్ పరిధిలో మట్టి తవ్వకాలకు ఐదు విభాగాల నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంది. అయితే నిబంధనలను తుంగలోకి తొక్కి మట్టిని తరలించినా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం విశేషం.

# జనసేనలో అసమ్మతి గళం

- పార్టీని వీడే యోచనలో కొందరు ఇన్‌చార్జిలు



జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో జనసేన నేతలు అసమ్మతి గళం విప్పుతున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తు కారణంగా సీట్లు రాని చోట్ల ఇన్‌చార్జిల హోదాలో ఉన్న వారు స్వ'లాభం' కోసం పార్టీని వీడేందుకు మార్గాలు సుగమం చేసుకుంటున్నారు. జనసైనికులు మాత్రం అందుకు దీటుగా పోటీ సమావేశాలు పెట్టి కేడర్‌ను కాపాడుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు.

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

ముమ్మిడివరం అసెంబ్లీ సీటును ఆశించి భంగపడ్డ జనసేన ఇన్‌చార్జి, రాష్ట్ర పీఏసీ సభ్యుడు పితాని బాలకృష్ణ శని వారం ఆ పార్టీని వీడి అధికార పార్టీలో చేరతారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఇప్పటికే ఆయన వైసీపీ రీజనల్ కో-ఆర్డినేటర్, ఎంపీ మిథున్‌రెడ్డితో మంతనాలు జరిపిన విషయం తెలిసిందే. శుక్రవారం నియోజకవర్గ స్థాయిలో సమావేశం నిర్వహిస్తున్నట్టు పితాని బాలకృష్ణ చెప్పారు. పార్టీని వీడే అంశంపై కేడర్‌తో చర్చించి తుది నిర్ణయాన్ని ప్రకటించేందుకే ఆయన ఈ సమావేశం పెట్టారని ఒక వర్గం ఆరోపిస్తోంది. అయితే అందుకు దీటుగా నిజమైన జన సైనికులతో మరో సమావేశాన్ని ఏర్పాటుచేసేందుకు నాయకులు సన్నాహాలు చేస్తున్నారు.

అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావును టీడీపీ అధిష్ఠానం ప్రకటించింది. అయితే రెండు వర్గాల నేతలు, కార్యకర్తలు తమ మధ్య సఖ్యత లేకపోవడంతోనే సీటు కోల్పోయామని భావిస్తున్నప్పటికీ ఇంకా ఏకతాటిపైకి రాలేదు. సరికదా ఎవరి వ్యూహాల్లో వారు ఉండి టీడీపీని ఇరకాటంలోకి నెట్టేందుకు ప్రయత్నిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. జనసేన ఇన్‌చార్జి శెట్టిబత్తుల రాజబాబు వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డిని కలిసిన సంగతి తెలిసిందే. అయితే పార్టీలో చేరడమా లేక వైసీపీ పరోక్ష మద్దతుగా స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగడమా అనేది వెల్లడి కావాల్సి ఉంది. రాజబాబు మిథున్‌రెడ్డిని కలిసిన వీడియోలు ప్రచారంలో ఉండడంతో ఆయన వెన్నంటి ఉండే కేడర్ డైలమాలో పడింది. రాజబాబు వెంట నడవడమా లేక జనసేన లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయడమా అనేది తేలాల్సి వుంది. ఇప్పటికే ఒకవర్గం నాయకులు వేమవరంలో సమావేశమై పార్టీ దిశానిర్దేశంతో పాటు టీడీపీ అభ్యర్థి నుంచి స్పష్టమైన హామీలు తీసుకున్న తర్వాతే ఎన్నికల్లో పనిచేయాలనే నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం.

రాజోలు అసెంబ్లీ నియోజకవర్గంలోనూ అసంతృప్తి వ్యక్తమవుతోంది. జనసేన అభ్యర్థిగా రిటైర్డ్ ఐఏఎస్ దేవ వరప్రసాద్‌ను ప్రకటించడంతో ఆ స్థానంపై ఆశలు పెట్టుకున్న బొంతు రాజేశ్వరరావు అధిష్ఠానం తీరుపై నిప్పులు చెరుగుతున్నారు. బుధవారం ఆయన తన మద్దతుదారులతో మలికిపురంలోని స్వగ్రామంలో భారీ సమావేశం నిర్వహించారు. తన అసంతృప్తి వెళ్లగక్కి పార్టీ ఇచ్చిన హామీల కోసం కొన్ని రోజులు వేచి చూద్దామని కేడర్‌కు నచ్చజెప్పడం ద్వారా అధిష్ఠానానికి పరోక్ష సంకేతాలు పంపారు.

రామచంద్రపురం విషయానికొస్తే టీడీపీ అభ్యర్థి వాసంశెట్టి సుభాష్‌కు జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, మరో ఆశావహుడు చిక్కాల దొరబాబు వర్గాల వారు మద్దతు తెలుపుతున్నట్టు ప్రకటనలు చేస్తున్నాయి. అయితే ప్రత్యక్ష కార్యాచరణకు వచ్చేటప్పటికి మాత్రం జనసేన కేడర్ ఇంకా అడుగులు వేయలేదు.

మండపేట ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ పార్టీ నిర్ణయంపై ఆది నుంచీ అసంతృప్తిగానే ఉండడంతో పాటు ఎన్నికల కార్యాచరణకు దూరంగానే ఉన్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కొత్తపేటలో జనసేన ఇన్‌చార్జి బండారు శ్రీనివాసరావు తన సోదరుడైన టీడీపీ అభ్యర్థి బండారు సత్యానందరావుతో కలిసిమెలిసి అడుగులు వేస్తున్నారు. అయితే అక్కడక్కడా జనసేనలోని కార్యకర్తలు కొంత అసంతృప్తితో వైసీపీలోకి వెళ్తున్నట్టు సమాచారం. మొత్తంమీద జిల్లాలో జనసేనకు కేటాయించిన రెండు సీట్లలో ఐఏఎస్ అధికారి దేవ వరప్రసాద్ (రాజోలు), మరో విశ్రాంత పోలీసు అధికారి గిడ్డి సత్యనారాయణ (పి.గన్నవరం)లకు అవకాశం కల్పించి ఏళ్ల తరబడి పార్టీ కోసం పనిచేస్తున్న వారికి అధిష్ఠానం చేయి ఇవ్వడంతో పార్టీలోని నిజమైన కేడర్ నిరుత్సాహంతో ఉంది.



మలికిపురం మండలం ఉయ్యూరివారి మెరకలో మాట్లాడుతున్న హరీష్‌మాధుర్ (ఎడమ) సఖినేటిపల్లి మండలం రామేశ్వరంలో మాట్లాడుతున్న వర ప్రసాద్ (కుడి)



# బలహీనవర్గాలకు టీడీపీ హయాంలోనే న్యాయం

అమలాపురం లోక్‌సభ ఉమ్మడి అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్

మలికిపురం, మార్చి 28: బలహీన వర్గాలకు టీడీపీ ప్రభుత్వంలోనే పూర్తి న్యాయం జరుగుతుందని అమలాపురం లోక్‌సభ టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్ అన్నారు. ఉయ్యూరివారిమెరకలోని జేబీ ఫంక్షన్ హాలులో క్లస్టర్-3 ఇన్‌చార్జి బత్తుల రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో బీసీసెల్ మండల అధ్యక్షుడు కొల్లు మహలక్ష్మి అధ్యక్షతన గు రువారం 'జయహో బీసీ' సదస్సు నిర్వహించారు. హరీష్‌మాధుర్ మాట్లాడుతూ బీసీ డిక్లరేషన్ వల్ల జరిగే మేలును ప్రతి బీసీ కుటుంబానికీ వివరించాలన్నారు. వైసీపీ పాలనలో హక్కుల కోసం ప్రశ్నించిన బీసీ నాయకులపై తప్పుడు కేసులు బనాయించడంతో పాటు ఎందరినో బలి తీసుకున్నారన్నారు. బీసీ సబ్ ప్లాన్ నిధులను ఇతర పథకాలకు మళ్లించారని, బీసీ పిల్లల ఉసురు జగన్‌కు తగులుతుందన్నారు. బీసీలకు రక్షణ చట్టం తెచ్చామని, ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రాగానే కేంద్రంతో మాట్లాడి చట్టం చేయిస్తామన్నారు. బీసీల్లో 50 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ రూ.4వేలు పెన్షన్ ఇస్తామన్నారు. రజక సామాజికవర్గానికి అసెంబ్లీ స్థానాన్ని కేటాయించి చంద్రబాబు ప్రత్యేక గుర్తింపు ఇచ్చారన్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా ఎన్నో పథకాలు అమలు చేసిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీల కోసం లక్షన్నర కోట్లు బడ్జెట్‌లో పెట్టిస్తామన్నారు. రాజోలు అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి దేవ వరప్రసాద్ మాట్లాడుతూ హరీష్‌మాధుర్ సహకారంతో కోనసీమలో రైలు కూత వినిపిద్దామన్నారు. వైసీపీ ప్రభుత్వం విదేశీ విద్యను నాశనం చేసిందన్నారు. టీడీపీ హయాంలో 4వేల మందికి విదేశీ విద్యకు అవకాశం కల్పిస్తే, వైసీపీ పాలనలో కేవలం 22మందికే అవకాశం కల్పించారని విమర్శించారు. విదేశీ విద్య పథకానికి అంబేడ్కర్ పేరు తొలగించడం దుర్మార్గమన్నారు. గుంటూరులో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ప్రకటించిన బీసీ డిక్లరేషన్ అద్భుతమన్నారు. రాబోయే ఉమ్మడి ప్రభుత్వంలో ఐదు సంవత్సరాల్లో రూ.లక్షా 50వేల కోట్లను బలహీనవర్గాలకు కేటాయిస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వం 56 కార్పొరేషన్లు పెట్టి ఒక్క రూపాయి కూడా కేటాయించకుండా బలహీనవర్గాలకు పూర్తిగా అన్యాయం చేసిందన్నారు. సదస్సులో నేతలు ముప్పర్తి నాని, గుబ్బల శ్రీనివాస్, అడబాల యుగంధర్, ముదునూరి చినబాబురాజు, రుద్రరాజువెంకట్రామరాజు, చింతా వీరభద్రేశ్వరరావు, చెల్లుబోయిన శ్రీనివాస్, గుండుబోగుల పెదకాపు, కౌరు శ్రీనివాస్, కొండా శివయ్య, తాడి సత్యనారాయణ, బత్తుల రవీంద్రనాథ్, బొక్కా గోవిందు, మంగెన నాని, రాపాక నవరత్నం, చాగంటి స్వామి, బందెల పద్మ, మోకా పార్వతి, చెల్లింగి జాంబవతి, కొల్లు మహాలక్ష్మి, తిరుమాని ఆచార్యులు, అంతర్వేదిపాలెం పుల్లయ్య అయినవిల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సఖినేటిపల్లి మండలం రామేశ్వరంలో దివ్యాంగుడితో మాట్లాడుతున్న వరప్రసాద్

**అంతర్వేది:** బలహీనవర్గాల భవిష్యత్తు టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని టీడీపీ రాజోలు అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకుడు చిటికెల రామ్మోహనరావు అన్నారు. గురువారం సఖినేటిపల్లి మండలం రామేశ్వరంలో క్లస్టర్-1 ఇన్‌చార్జి చెల్లింగి లీలామోహన్‌శ్రీనివాస్ ఆధ్వర్యంలో బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు మెరుగుముప్పల సత్యవరప్రసాద్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రామ్మోహనరావు మాట్లాడుతూ గుంటూరు పశ్చిమ సీటును రజక సామాజికవర్గానికి కేటాయించి వారికి చంద్రబాబు ప్రత్యేక గుర్తింపు ఇచ్చారన్నారు. రాజోలు ఉమ్మడి అసెంబ్లీ అభ్యర్థికి గ్లాసు గుర్తుపై, అమలా పురం లోక్‌సభ అభ్యర్థికి సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఉమ్మడి అభ్యర్థి దేవ వరప్రసాద్ మాట్లాడుతూ బలహీనవర్గాల వారికి రక్షణ చట్టం తీసుకువచ్చి వారు ఆత్మవిశ్వాసంతో జీవించేలా ఉమ్మడి ప్రభుత్వం చట్టం తీసుకురాబోతోందన్నారు. సదస్సులో ముప్పర్తి నాని, గుబ్బల శ్రీనివాస్, ముదునూరి చినబాబురాజు, రుద్రరాజు వెంకట్రామరాజు, చాగంటి స్వామి, కొల్లు మహాలక్ష్మి, తిరుమాని ఆచార్యులు, వనమాలి మూలాస్వామి, గుబ్బల రమేష్, టీడీపీ, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు. శనివారం లక్ష్మీనరసింహస్వామి దర్శనం అనంతరం సఖినేటిపల్లి మండలంలోని గ్రామాల్లో ఉమ్మడి అభ్యర్థి దేవ వరప్రసాద్ పర్యటన ఉంటుందని నాయకులు తెలిపారు.





# వారాహి వస్తోంది..

## ఎన్నికల శంఖారావం పూరించడానికి

- రేపు సాయంత్రం చేబ్రోలులో సభ
- ఆ రోజు ఉదయమే పిఠాపురానికి పవన్

పిఠాపురం, మార్చి 28: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ రాష్ట్రవ్యాప్తంగా తన ప్రచారానికి ఈనెల 30వ తేదీన శ్రీకారం చుట్టనున్నారు. పిఠాపురం నియోజకవర్గం నుంచి వారాహి విజయభేరి మోగించనున్నారు. ఆ రోజు సాయంత్రం 4గంటలకు గొల్లప్రోలు మండలం చేబ్రోలు రామాలయం సెంటర్‌లో జరిగే సభలో వారాహి వాహనంపై నుంచి పవన్ ప్రసంగించనున్నారు. పవన్‌కల్యాణ్ తాను పోటీ చేయనున్న పిఠాపురం నియోజకవర్గం నుంచే ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నట్లు ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇందుకు సంబంధించి పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి అధికారికంగా సమాచారం అందింది. ఆ మేరకు పార్టీ నాయకులు అనుమతులు కోసం పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఆర్వోకు, పోలీసులకు గురువారం సాయంత్రం దరఖాస్తు చేశారు. 30వ తేదీన హెలికాప్టర్‌లో పవన్‌కల్యాణ్ గొల్లప్రోలు పట్టణ శివారులోని హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. అక్కడ నుంచి పుర్హుతికాశక్తి పీఠానికి చేరుకుని వారాహి వాహనానికి పూజలు నిర్వహిస్తారు. దత్త పీఠాన్ని దర్శించుకుంటారు. అనంతరం పిఠాపురం మండలం కుమారపురంలోని ప్రైవేటు హోటల్‌కు చేరుకుని అక్కడ బసచేసి సాయంత్రం వారాహి వాహనంపై గొల్లప్రోలు మండలం చేబ్రోలు చేరుకుంటారని పార్టీ వర్గాలు తెలిపాయి. సాయంత్రం 4గంటలు నుంచి జరిగే వారాహి విజయభేరి యాత్రలో పాల్గొని సభకు హాజరయిన వారిని ఉద్దేశించి ప్రసంగిస్తారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు చేయాలని కేంద్ర కార్యాలయం నుంచి సూచనలు జారీ కావడంతో ఏర్పాట్లు చేయడంలో జనసేన నాయకులు నిమగ్నమయ్యారు. కాగా పవన్ రాష్ట్రవ్యాప్త ప్రచారానికి వినియోగించే వారాహి వాహనం గురువారం రాత్రి కాకినాడ చేరుకుంది.

# అబ్బురపరిచాయి

## రెండో రోజూ కొనసాగిన నావికాదళ విన్యాసాలు



సర్పవరం జంక్షన్, మార్చి 28: కాకినాడ సాగరతీరంలో సూర్యారావుపేట నేవెల్ ఎన్‌క్లేవ్‌లో భారత్ త్రివిధ దళాలు-అమెరికా యాంఫీబీయాస్ టైగర్ ట్రయంఫ్-2024 సైనిక విన్యాసాలు రెండో రోజు గురువారం కూడా కొనసాగాయి. ఎక్స్ టైగర్ ట్రయంఫ్ సీ ఫేజ్‌లో భాగంగా యుద్ధ సమయంలో శత్రువులపై ఆకాశం, భూభాగం, సముద్రం పై నుంచి త్రివిధ దళాలు జరిపే పోరాటం, యుద్ధ నైపుణ్యాల ప్రదర్శన, యుద్ధ ట్యాంకర్లు, యుద్ధ నౌకలు, ఆయుధాల వినియోగం, హెలికాప్టర్ల ద్వారా శత్రువుల శిబిరాలపై దాడులు చేశారు. బంకర్లలో ఆర్మీ సిబ్బంది ఆయుధాలతో జల, భూ ఉపరితలం, ఆకాశమార్గాల ద్వారా శత్రువుల శిబిరాలపై ఫిరంగులు, బాంబులతో బాంబుల మోత మోగించారు. ఈ యాంఫీబీయాస్ విన్యాసాలు ఈ నెల 30వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. కాకినాడ -ఉప్పాడ బీచ్ రోడ్డులో రాకపోకలు నిషేధించామని, ప్రత్యామ్నాయ మార్గాల్లో వాహనదారులు వెళ్లాలని కాకినాడ రూరల్ సర్కిల్ సీఐ కె. శ్రీనివాస్ కోరారు.



# 'షాలిమార్'లో సాంకేతిక లోపం

## రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లో నిలిపివేత

## ఐదు గంటలకు పైగా ప్రయాణికులకు నరకం



నిలిచిపోయిన ఎక్స్‌ప్రెస్



అధికారులతో వాగ్వాదం

రాజమహేంద్రవరం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): షాలిమార్- సికింద్రాబాద్ వారాంతపు రైల్లో (నెం.22849) సాంకేతిక లోపం ఏర్పడి రాజమండ్రి రైల్వే స్టేషనులో 5.30 గంటలు నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. సికింద్రాబాద్ వెళ్తున్న రైలుకు కడియం రైల్వే స్టేషను దాటిన తర్వాత రైలు బోగీలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో అధికారులు రైలును నెమ్మదిగా రాజమండ్రి తీసుకొచ్చి రెండో ప్లాట్‌ఫాం వద్ద నిలిపారు. వెంటనే రైల్వే ఎలక్ట్రికల్ తదితర విభాగాల సిబ్బంది రంగంలోకి దిగి లోపాన్ని గుర్తించే పని చేపట్టారు. ఇంజన్‌లో లోపం ఉందనుకొని వేరొక ఇంజను ఏర్పాటు చేసినా ఫలితం లేకపోయింది. ముందువైపు ఉన్న జనరేటర్ బోగీ (పవర్ కార్)లో లోపం తలెత్తిందని గుర్తించారు. ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో వెనుక కూడా వేరొక ఇంజను అమర్చి- వెనుక ఉన్న పవర్ కార్ ద్వారా విద్యుత్తు సరఫరా చేశారు. దీంతో ఉదయం 7.30గంటలకు వచ్చిన రైలు మధ్యాహ్నం 1గంటలకు బయలుదేరింది. అప్పటికే ఈ రైలు రెండు గంటలు ఆలస్యంగా నడుస్తుండడం గమనార్హం.

**● ప్రయాణికులకు నరకం**

రైలుకు 19బోగీలు ఉండగా అందులో 12 ఏసీ బోగీలు ఉన్నాయి. మొత్తం అన్ని బోగీల్లోనూ విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. ఏసీలు ఆగిపోవడంతో ఆ బోగీల్లోని ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. గాలి ఆడకపోవడంతో చిన్న పిల్లలు అవస్థలు పడ్డారు. సెల్‌ఫోన్లలో చార్జింగ్ అయిపోవడంతో ప్లాట్‌ఫాంపై ఉన్న సాకెట్లలో చార్జింగ్ పెట్టుకొన్నారు. కొన్ని బోగీల్లో నీటి సరఫరా కూడా ఆగిపోయింది. ప్యాంట్రీ కార్ (వంట బోగీ)లో కూడా విద్యుత్ నిలిచిపోవడంతో టీ తయారు చేయడానికి కూడా వీలు లేకుండా పోయింది. గంటల పాటు రైలు నిలిచిపోవడంతో ప్రయాణికులు సహనం కోల్పోయారు. రెండో ప్లాట్‌ఫాంపై ఉన్న స్టేషను మాస్టారు గది వద్ద గుమిగూడి అధికారులతో వాగ్వాదానికి దిగారు. తమ బంధువు హార్ట్ పేషెంట్ అని, అన్ని గంటలు ఏసీలు ఆగిపోవడంతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారంటూ ఓ మహిళ స్టేషను మాస్టారు వద్ద ఆవేదన వ్యక్తం చేసింది. ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సైదయ్య, జీఆర్పీ ఎస్ఐ లోవరాజు తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. స్టేషను మేనేజర్ రంగనాథ్, సీటీఐ చంద్రమౌళి, సీసీఐ కల్యాణ్, ఎలక్ట్రికల్ ఇంజనీర్ సురేంద్ర, లోకో ఇన్‌స్పెక్టర్ లక్ష్మణరావు మరమ్మతు పనులను పర్యవేక్షించారు.

# కవలగొయ్యిలో వ్యక్తి హత్య

రాజమహేంద్రవరం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధాల నేపథ్యంలో ఓ వ్యక్తి హత్యకు గురైన ఘటన బొమ్మూరు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. అతని తల్లి పలుకూరి సరోజిని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం.. రాజమహేంద్రవరం రూరల్ కవలగొయ్యి ప్రాంతానికి చెందిన సరోజిని చిన్న కుమారుడు భాస్కరరావు(35)కు సత్యవాణితో 17 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. తర్వాత మనస్పర్థల వల్ల 12 ఏళ్ల క్రితమే కోర్టు ద్వారా విడాకులు తీసుకున్నారు. దీంతో భాస్కరరావు తల్లిదండ్రుల వద్ద ఉంటున్నాడు. అదే ప్రాంతంలో పాత ఇనుము వ్యాపారం చేసే గుజ్జు లక్ష్మి భర్తతో గొడవల వల్ల ఐదేళ్ల నుంచి విడిగా ఉంటోంది. భాస్కరరావుకు ఆమెతో పరిచయం ఏర్పడి మూడున్నరేళ్ల నుంచి సహజీవనం చేస్తున్నాడు. ఈ మధ్య భాస్కరరావును ఇంటికి రావద్దంటూ లక్ష్మి దూరం పెట్టింది. దీంతో అతడు తాగుడుకు బానిసయ్యాడు. ఇదిలా ఉండగా.. భాస్కరరావుతో కందిరెల్లి నారాయణమూర్తి అనే వ్యక్తి కొన్ని రోజులుగా పరిచయం పెంచుకున్నాడు. అతడితో లక్ష్మికి పరిచయం ఏర్పడి వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఈ క్రమంలో బుధవారం రాత్రి 10.30 గంటల సమయంలో భాస్కరరావును నారాయణమూర్తి లక్ష్మీనగర్‌లో ఉన్న గంగుల సూర్యనారాయణ లేఅవుట్ దగ్గరలో వాచ్‌మన్ నివాసం ఉండే పాక వద్దకు తీసుకెళ్లి మందు తాగించాడు. అర్థరాత్రి 12.30 గంటల ప్రాంతంలో తన వెంట తెచ్చుకున్న కత్తితో భాస్కరరావును పొడుస్తుండగా వాచ్‌మన్ చూసి పారిపోయాడు. గురువారం ఉదయం తన వద్దకు వచ్చి వాచ్‌మన్ విషయం చెప్పగా అక్కడకు వెళ్లి చూడగా తన కొడుకు భాస్కరరావు రక్తపు మడుగులో చనిపోయి ఉన్నాడని సరోజిని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

# అరాచక పాలనకు చరమగీతం పాడాలి

## బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి



సమావేశంలో మాట్లాడుతున్న దగ్గుబాటి పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 28: రాష్ట్రంలో వైసీపీ సాగిస్తున్న విధ్వంసకర, అరాచక పాలనకు చరమగీతం పాడాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పిలుపునిచ్చారు. రాష్ట్రంలో పేదలు నిలువునా వంచింపబడుతున్నారని, ఈ పరిస్థితుల్లో కూటమి అధికారంలోకి రావడం చారిత్రక అవసరమని పేర్కొన్నారు. గురువారం రాజమహేంద్రవరంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో రాజమండ్రి పార్లమెంట్ ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు, అసెంబ్లీ వారీ ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు, కోర్ కమిటీ, జిల్లా పదాధికారులు, అసెంబ్లీ కన్వీనర్లు, కో కన్వీనర్లు, వివిధ మోర్చాల జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, మండలం అధ్యక్షులు, ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి పురందేశ్వరితో పాటు బీజేపీ రాష్ట్ర ఎన్నికల సహ ఇన్‌చార్జి సిద్ధార్థనాథ్ సింగ్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. పురందేశ్వరి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వాన్ని విమర్శిస్తే పోలీసు కేసులు నమోదు చేస్తున్నారని, ఈ పరిస్థితుల్లో ప్రభుత్వాన్ని మార్చడానికి చూపుడువేలును ఉపయోగించాలని సూచించారు. రాష్ట్ర సచివాలయాన్ని కూడా తనఖా పెట్టిన పరిస్థితి ఉందన్నారు. ఇసుక లేకపోవడం వల్ల రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికులు పనుల్లేక పస్తులుంటున్నారన్నారు. బీసీ కమిషన్‌కు చట్టబద్ధత కల్పించలేదని, దిశ యాప్ ద్వారా మహిళలకు రక్షణ కలగడంలేదని అన్నారు. రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులపై తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ తరపున ఎవరు నిలబడినా అక్కడ నిలబడింది మోదీగానే భావించాలన్నారు. విశాఖ డ్రగ్స్ కేసులో తమ కుటుంబానికి ఎలాంటి సంబంధంలేదని స్పష్టం చేశారు. సిద్ధార్థనాథ్ సింగ్ మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వస్తే పోలవరం ప్రాజెక్టు పూర్తిచేస్తామని హామీ ఇస్తున్నామన్నారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, అనపర్తి అసెంబ్లీ అభ్యర్థి శివరామకృష్ణ రాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు సన్నారెడ్డి దయాకర్, సాగి కాశీ విశ్వనాథరాజు, కోడూరి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

# పక్కాగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు

## ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్



కొవ్వూరు, మార్చి 28: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని ఏలూరు రేంజ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ జనరల్ (ఐజీ) జీవీజీ అశోక్‌కుమార్ అన్నారు. కొవ్వూరు టౌన్, రూరల్ పోలీసుస్టేషన్లు, డీఎస్పీ కార్యాలయంలో గురువారం ఆయన వార్షిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరించి ఏలూరు రేంజ్ పరిధిలోని ఆరు జిల్లాల్లో కలెక్టర్లు, ఎస్పీలను సమన్వయం చేసుకుని మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌ను పకడ్బందీగా అమలు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై సిబ్బందికి శిక్షణా తరగతులు నిర్వహించామన్నారు. చాలా కాలం నుంచి పెండింగ్‌లో ఉన్న ఎన్‌బీడబ్ల్యులలో ఇంతవరకు ఆరు జిల్లాల్లో 1842 ఎన్‌బీడబ్ల్యులు ఎగ్జిక్యూట్ చేశామన్నారు. జిల్లాలో వీఐపీలు, ప్రజా ప్రతినిధులు పర్యటించినప్పుడు భద్రతా పరంగా బందోబస్తు నిర్వహించడానికి కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల కాకుండానే డిసెంబరు నుంచి ఎన్ఫోర్స్‌మెంట్ అమలు ప్రక్రియ ప్రారంభించామన్నారు. ఐడీ లిక్కర్, పులిసిన బెల్లపు ఊట, ఎన్‌డీపీఎల్ సీసాలు, టెట్రా ప్యాకెట్లు డీపీఎల్ (గంజాయి), ఎన్‌డీపీఎస్, క్యాష్, ప్రీసియస్ మెటల్, ఫ్రీ బీస్ తదితరాలకు చెందిన 7489 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి 4067 మందిని అరెస్టు చేసి రూ.15,53,74,279 విలువ గల వాటిని సీజ్ చేశామన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో మద్యం, డబ్బు ప్రభావాన్ని తగ్గించడానికి చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి దాడులు మరింత తీవ్రతరం చేశామన్నారు. ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ సరళిపై పోలీసు సిబ్బందికి శిక్షణను అందజేశామన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. నోటిఫికేషన్ వచ్చిన దగ్గర నుంచి పోలింగ్ రోజు తీసుకోవలిసిన భద్రతా పరమైన చర్యలు, కౌంటింగ్ సమయంలో ఏ విధమైన బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలనే అంశాలపై పోలీసు సిబ్బందికి శిక్షణను అందజేస్తున్నామన్నారు. పోలీసు సిబ్బంది ఎటువంటి తప్పులు చేయకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఐజీ వెంట జిల్లా ఎస్పీ పి.జగదీష్, డీఎస్పీ కేసీహెచ్ రామారావు,సీఐలు వి.జగదీశ్వరరావు, పి.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

# సాగునీటి సమస్య పరిష్కారానికి అధికారుల హామీ

## వంతుల వారీ విధానం లేకుండానే బీడు భూములకు నీరివ్వాలని నిర్ణయం



అధికారులతో మాట్లాడుతున్న రైతులు

తాళ్లరేవు, మార్చి 28: వంతుల వారీ విధానంతో ఎటువంటి సంబంధం లేకుండా గ్రాంటు ప్రాంతంలో వరిచేలకు సాగునీరు అందించేందుకు ఇరిగేషన్ అధికారులు హామీ ఇచ్చారు. 'వరిచేలో రయ్ రయ్, బీడుబారిన వరిచేలు' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఇరిగేషన్ అధికారుల బృందం గ్రాంటు ప్రాంతానికి కదలింది. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పి.మల్లవరం పంచాయతీ గ్రాంటులో ఎండిన వరిచేలు, ద్విచక్ర వాహనాలు తిప్పిన వరిచేలను ఇరిగేషన్ అధికారుల బృందం పరిశీలించింది. ముందుగా ఇరిగేషన్ అధికారి, సిబ్బందితో కారులో సర్వే చేసి రైతులకు ఏ సమాధానం చెప్పకుండా వెళ్లిపోవడంతో రైతులు ఆగ్రహించి రోడ్డుపై పురుగు మందుల డబ్బాలను పట్టుకుని రాస్తారోకో నిర్వహించారు. సాగునీరు ఇస్తారా.. పురుగుల మందు తాగమంటారా అంటూ రైతులు నినాదాలు చేశారు. ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ సతీష్‌కుమార్, ఈఈ రామకృష్ణ, ఎస్ఈ శ్రీనివాసరావు, డీఈ హిమరత్నం, ఏఈ ఈశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకోవడంతో రైతులు అధికారులను సాగునీరు ఇవ్వాలని నిలదీశారు. ఇరిగేషన్ అధికారులు కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి రైతుల ఇబ్బందులను వివరించి వారితో చర్చలు జరిపారు. ఈ రోజు నుంచి వంతులవారీ విధానంతో సంబంధం లేకుండా 15 రోజుల పాటు సాగునీటి సరఫరాకు చర్యలు చేపడతామన్నారు. ఇంజన్లతో సాగునీరు కాలువలోకి డంప్ చేసి ప్రతి ఎకరాకు నీరు అందించేందుకు చర్యలు చేపడతామన్నారు. ఓఎన్‌జీసీ ప్రతినిధులతో రైతుల సహకారంతో వినతిపత్రం అందించి సాగునీరు అందించే ప్రయత్నం చేస్తామన్నారు. దీంతో తాత్కాలికంగా రైతుల సమస్య పరిష్కారమైంది. కోరింగ ఎస్ఐ రవికుమార్, ఏఎస్ఐ సత్యనారాయణమూర్తి, ఇరిగేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

**సాగునీటి సమస్య పరిష్కరించి న్యాయం చేయాలి: దాట్ల బుచ్చిబాబు**

గ్రాంటు రైతులకు సాగునీరు అందించి పంటనష్టపోకుండా చర్యలు చేపట్టాలని ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు ఇరిగేషన్ అధికారులను ఫోన్‌లో కోరారు. రైతులకు సాగునీరు అందించి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం, ఇన్సూరెన్స్ రాయితీలను అందివ్వాలని డిమాండ్ చేశారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటానని రైతులకు హామీ ఇచ్చారు. వ్యవసాయ సాగు చేసే రైతులందరికీ మత్స్యకారుల తరహాలో పంట నష్టపరిహారాన్ని ప్రతి రైతుకు అందించేలా చర్యలు చేపట్టాలని రైతు ఎం.డేవిడ్‌రాజు డిమాండ్ చేశారు.

# ట్రాఫిక్ ఎస్ఐపై దాడి

## రోడ్డుపై వీరంగం సృష్టించిన మందుబాబులు

## తీవ్రంగా గాయపడ్డ ఎస్ఐ ● ఆస్పత్రికి తరలింపు



తీవ్రంగా గాయపడిన ఎస్ఐ



నిందితుడు కేశవ వీరంగం

కరప, మార్చి 28: కాకినాడ జిల్లా కరప మండలం ఉప్ప లంకలో గురువారం సాయంత్రం మందుబాబులు విధి నిర్వహణలో ఉన్న ట్రాఫిక్ ఎస్ఐపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. కరప పోలీసులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. కాకినాడ ట్రాఫిక్ ఎస్ఐ సీహెచ్.కిషోర్‌కుమార్ యానాం జాతీయ రహదారిపై ఉప్పలంక వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేస్తున్నారు. ఆ సమయంలో మోటర్‌సైకిల్‌పై అటుగా వెళ్తున్న పాలెపు రాజు అనే వ్యక్తిని ఆపి డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించారు. అయితే బైక్ వెనుక ఉన్న అతని బావమరిది కర్రి కేశవ మద్యం మత్తులో ట్రాఫిక్ ఎస్ఐతో వాగ్వాదానికి దిగాడు. తన బావ రాజు మద్యం సేవించలేదని, ఖైనీ ప్యాకెట్ వేసుకుంటే మందు తాగినట్టు మిషన్ తప్పుగా చూపిస్తుందని ఎదురు తిరిగాడు. ఫూటుగా మద్యం సేవించి ఉన్మాద స్థితిలో ఉన్న కేశవ తన వొంటిపై ఉన్న చొక్కాను విప్పేసి పిచ్చి పిచ్చిగా అరుస్తూ ఊగిపోయాడు. పక్కనే దొరికిన పింగాణీ ముక్కను చేతిలోకి తీసుకుని దగ్గరికి వస్తే పీక కోసుకుంటానంటూ బెదిరించాడు. ఈ క్రమంలో పింగాణీ ముక్కతో ఎస్ఐపై దాడిచేశాడు. ఈ దాడిలో కిషోర్‌కుమార్ చెంపపై గాయమై తీవ్ర రక్తస్రావం అయ్యింది. ఈ హఠాత్పరిణామంతో భీతిల్లిన ట్రాఫిక్ సిబ్బంది అతికష్టంపై నిందితులను అదుపులోకి తీసుకుని కరప పోలీసులకు అప్పగించారు. నిందితుడు కర్రి కేశవ ఉప్పలంక గ్రామానికి చెందినవాడు కాగా ప్రస్తుతం పగడాలపేటలో ఉంటూ కాకినాడ ఫిషింగ్‌హార్బర్‌లో పనిచేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. అతని బావ పాలెపు రాజుది అమలాపురం మండలం మాసంగితిప్ప శివారు బ్రహ్మసమాజం అని, అతను కూడా కాకినాడలో ఉంటున్నట్టు చెప్పారు. కేశవ తాత మూడురోజుల క్రితం చనిపోగా గురువారం ఉప్పలంకలో చిన్నదినం జరిగిందని, ఈ దినకర్మకు వచ్చి బావ, బావమరిది ఫూటుగా మద్యం సేవించారని కరప ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. గాయపడిన ట్రాఫిక్ ఎస్ఐకి కరప పోలీస్‌స్టేషన్‌లోనే ప్రాథమిక చికిత్స చేయించి అనంతరం ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితులిరువురిపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ రామకృష్ణ చెప్పారు.

# దొంగతనం కేసులో ఇద్దరి అరెస్టు

అమలాపురం టౌన్, మార్చి 28: గత ఏడాది జరిగిన ఇంటి దొంగతనం కేసులో పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ఇద్దరిని అరెస్టు చేసి వారి నుంచి 52 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు అమలాపురం డీఎస్పీ ఎం.మహేశ్వరరావు తెలిపారు. స్థానిక స్వామి వివేకానంద వీధిలో నివాసం ఉంటున్న పేరాబత్తుల రాధాకృష్ణ సెప్టెంబరు 8న హైదరాబాద్ వెళ్లగా ఇంటి తాళాలు పగులకొట్టి కనిపించాయని సమీప నివాసితులు అతనికి ఫోను చేశారు. వెంటనే తిరిగి వచ్చి ఫిర్యాదు చేయగా అమలాపురం పట్టణ పోలీసు స్టేషన్‌లో అప్పటి సీఐ టి.క్రాంతి కుమార్ ఈ కేసులో పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన ఎ1 నిందితుడు ఈతకోట రాజ్‌కుమార్‌ను అరెస్టు చేసి 4.015 గ్రాముల బంగారాన్ని రికవరీ చేసి కోర్టులో హాజరుపరిచారు. అనంతరం ఎస్పీ ఎస్.శ్రీధర్ పర్యవేక్షణలో కేసు దర్యాప్తును వేగవంతం చేసి పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన తానింకి నరేష్ (25), తమ్మినీడి షణ్ముఖమణి (31)ను అమలాపురం పట్టణ సీఐ కె.క్రిస్టఫర్ బుధవారం అరెస్టు చేసి బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. గురువారం నిందితులను కోర్టులో హాజరుపరిచారు. ఎస్ఐ ఎన్ఆర్ కిశోర్‌బాబు, సీసీఎస్ సీఐ అబ్దుల్‌సలాంలను ఎస్పీ శ్రీధర్ ప్రత్యేకంగా అభినందించారు.

# రూ.4.31 లక్షలు సీజ్

ఏలేశ్వరం, మార్చి 28: పత్రాలు చూపకుండా తీసుకెళ్తున్న రూ.4.31 లక్షలను గురువారం రెవెన్యూ కార్యాలయం వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ స్వాధీనం చేసుకుంది. జగ్గంపేట మండలానికి చెందిన లోవరాజు ఈ సొమ్మును ద్విచక్ర వాహనంపై తీసుకెళ్తుండగా స్వాధీనం చేసుకున్నారు.

# జేఎన్టీయూకేలో ముగిసిన ఇన్నోవేషన్ ఫెయిర్

జేఎన్టీయూకే, మార్చి 28: జేఎన్టీయూకే వర్సిటీలో రెండు రోజులుగా డిజైన్ ఇన్నోవేషన్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇన్నోవేషన్ ఫెయిర్ ఎగ్జిబిషన్ గురువారం ముగిసింది. సెనేట్ హాల్లో నిర్వహించిన ఇన్నోవేషన్ ఫెయిర్ ముగింపోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఐఎస్టీ డైరెక్టర్ ఏ.గోపాలకృష్ణ, విశిష్ట అతిథులుగా డాక్టర్ కిషోర్‌కుమార్, జగన్‌మోహన్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణ మాట్లాడుతూ పరిశోధనల ప్రాజెక్టులు సాంకేతికంగా సహాయ పడతాయన్నారు. అలాంటి వారిని ఎంటర్‌ప్రెన్యూర్స్‌గా మార్చేందుకు తాము తోడ్పాటునందిస్తామన్నారు. అనంతరం నమూనాల ప్రదర్శనలో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు బహుమతులను, కన్సొలేషన్ బహుమతులను అందజేశారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వీరవల్లి కళ్యాణ్ మనోహర్, డైరెక్టర్లు, అధ్యాపకులు, అను బంధ కళాశాలల పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా కళా ప్రకర్షణ



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

అన్నవరం, మార్చి 28: రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో గురువారం వెండి ధ్వజస్తంభ కళాప్రకర్షణ శాస్త్రోక్తంగా జరిగింది. ఉదయం 6 గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం, మంటపారాధన నిర్వహించారు. ఉదయం 8.08 నిమిషాలకు ఆవు, దూడ సాయంతో ధ్వజ స్తంభం కదిలించి కళాప్రకర్షణ గావించారు. అనంతరం కళాప్రకర్షణ హోమం జరిపించారు. కార్యక్రమంలో వ్యవస్థాపక ధర్మకర్త ఐ.వి రోహిత్, పీఆర్వో కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. చతుర్వేద పండితులు మహదాశీర్వచనం అందించారు. అనివేటి మండపంలో కార్యక్రమాలు నిర్వహించడంతో గురువారం రూ.1500 వ్రతం టిక్కెట్ల విక్రయాలు నిలుపుదల చేశారు. వెండి ధ్వజస్తంభం స్థానంలో దాత సాయంతో బంగారు ధ్వజస్తంభం ఏర్పాటు కానుంది. ఏప్రిల్ 18 నుంచి దీనికి సంబంధించి కార్యక్రమాలు ప్రారంభించి 22న నూతన బంగారు ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన గావించనున్నారు. నెల్లూరుకు చెందిన ఒక దాత బంగారు ధ్వజస్తంభం ఏర్పాటుకు సుమారు 3.5 కోట్లు వ్యయం చేయనున్నారు.

# ఆకట్టుకున్న ఏసు చిత్రం



రాయవరం, మార్చి 28: గుడ్‌ఫ్రైడే పురస్కరించుకుని రాయవరం గ్రామానికి చెందిన చిత్రకారుడు ఇడుంగమిల్లి సౌదాసాగర్ గీచిన ఏసుక్రీస్తు చిత్రపటం పలువురిని ఆకట్టుకుంది. ఏసుక్రీస్తు శిలువకు వేలాడుతున్న దృశ్యంతో పాటు మరోవైపు రక్తం చిందిస్తున్న ఏసుప్రభు చిత్రపటాన్ని వివిధ రకాల రంగులతో చిత్రీకరించాడు. వివిధ రకాల వాటర్ కలర్స్‌తో ఈ చిత్రం రూపొందించినట్లు సౌదాసాగర్ తెలిపారు.



# విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని శ్రమించాలి



చౌహాన్ దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం అర్బన్/(ఆంధ్రజ్యోతి), మార్చి 28: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని శ్రమించి చదువుకోవాలని పుదుచ్చేరి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శరత్ చౌహాన్ చెప్పారు. రాజమహేంద్రవరం పర్యటనలో భాగంగా ఆయన లాలాచెరువు హైస్కూల్‌ను, ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్ట్స్ కళాశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ పనిచేసిన తత్వశాస్త్ర విభాగాన్ని, కందుకూరి వీరేశలింగం పనిచేసిన తెలుగు విభాగాన్ని ఆయన తిలకించారు. అలాగే ప్రాచీనమైన గ్రంథాలకు నిలయమైన కళాశాల గ్రంథాలయం, పురాతన పరికరాలున్న భౌతికశాస్త్ర యాంటిక్ ల్యాబ్‌ను, అంబేడ్కర్ విగ్రహం, తరగతి గదులను శరత్ చౌహాన్ తన సతీమణితో కలిసి సందర్శించారు. ఆయన వెంట ఆర్డీవో చైత్రవర్షిణి, కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ సత్యవేణి, డిప్యూటీ ఈవో ఈవీవీబీఎన్ నారాయణ, ఎంఈవో దిలీప్‌కుమార్, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీశైలశాస్త్రి, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు ఉన్నారు.

# స్థాయీ సంఘాల సమావేశం

కాకినాడ సిటీ, మార్చి 28: సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళికి లోబడి ఏవిధమైన శాఖాపరమైన సమీక్షలు గాని, తీర్మానాలు గాని ఆమోదించకుండా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలు ముగించారు. గురువారం కాకినాడలోని జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ హాలులో ఏర్పాటు చేసిన ఈ సమావేశాలకు ఆయా స్థాయీ సంఘాల చైర్మన్‌లు అధ్యక్షత వహించారు. 1,2,4,7 స్థాయీ సంఘాల సమావేశాలు జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షతన నిర్వహించారు. అదే విధంగా 3వ స్థాయీ సంఘం సమావేశం జడ్పీ వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు అధ్యక్షతన, 5వ స్థాయీ సంఘ సమావేశం స్థాయీ సంఘ చైర్‌పర్సన్ రొంగల పద్మావతి అధ్యక్షతన, 6వ స్థాయీ సంఘ సమావేశం జడ్పీ వైస్ చైర్‌పర్సన్ మేరుగు పద్మలత అధ్యక్షతన జరిగాయి. ఈ సమావేశాల్లో జిల్లా పరిషత్ సీఈవో ఎ.శ్రీరామచంద్రమూర్తి, డిప్యూటీ సీఈవో జీఎస్ రాంగోపాల్ పాల్గొన్నారు.

## డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

•అమలాపురం •పి.గన్నవరం •రాజోలు •ముమ్మిడివరం •కొత్తపేట •మండపేట •రామచంద్రపురం

### డీఎస్పీ విచారణ

అల్లవరం, మార్చి 28: మండలంలోని ఓడలరేవు గ్రామానికి చెందిన పెచ్చెట్టి శ్రీకాంత్ తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి రిసార్ట్ వద్దకు తీసుకెళ్లి శారీరకంగా హింసించి మోసగించాడని ఓ యువతి ఫిర్యాదు చేసింది. దీనిపై అల్లవరం పోలీసులు ఎస్సీ, ఎస్టీ అత్యాచారం కేసు నమోదు చేశారు. అమలాపురం డీఎస్పీ ఎం.మహేశ్వరరావు గురువారం దర్యాప్తు నిర్వహించారు. గురువారం డీఎస్పీ దిండి రిసార్ట్‌లో విచారణ నిర్వహించారు. ఆయన వెంట ఎస్ఐ జి.హరీశ్‌కుమార్ ఉన్నారు.

### ఘనంగా స్వామివారి తెప్పోత్సవం



రావులపాలెంలో స్వామివారి తెప్పోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

రావులపాలెం, మార్చి 28: రావులపాలెంలో అలివేలుమంగ పద్మావతి ఆండాళ్‌సమేత శ్రీవేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం తెప్పోత్సవం నేత్రపర్వంగా సాగింది. అధిక సంఖ్యలో భక్తులు, గోవిందమాలధారులు తిలకించారు.

### 'సీ-విజిల్ ఫిర్యాదులను గంటలోపే పరిష్కరించాలి'

పి.గన్నవరం, మార్చి 28: సీ-విజిల్ యాప్ ద్వారా ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని జిల్లా పంచాయతీ అధికారి, సీ-విజిల్ యాప్ నోడల్ అధికారి డి.రాంబాబు సూచించారు. మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో ఫ్లైయింగ్ స్క్వాడ్, ఎంసీసీ టీమ్‌లకు ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో జరిగే రాజకీయపరమైన అంశాలు, ఆర్థిక లావాదేవీలు, మద్యం పంపకాలు, గిఫ్ట్ తాయిలాలు తదితర అంశాలకు సంబంధించి పబ్లిక్ ఫిర్యాదులు రూపంలో ఫొటోలు, వీడియోలు సీ-విజిల్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తారని వాటిని గంటలోపే పరిష్కరించి ఉన్నతాధికారుల సమాచారం నిమిత్తం సంబంధిత యాప్‌లో మళ్లీ అప్‌లోడ్ చేయాలన్నారు. సమస్య పరిష్కారమైన విషయం చివరికి రాష్ట్ర ఎన్నికల అధికారి దృష్టికి వెళుతుందన్నారు. అనంతరం ఎంసీసీ టీమ్‌లు కోడ్ సమయంలో అనుసరించాల్సిన అంశాలపై ఆయన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి షేక్‌హుస్సేన్, తహశీల్దార్లు ప్రేమద్వార్, ఎం.మేరికమ్మ, కె.విమలకుమారి, ఎంపీడీవోలు సీహెచ్ త్రిశూలఫాణి, మురళీ, లక్ష్మి, ఎస్.వేణుగోపాలరెడ్డి, సివిల్ సప్లయి డిప్యూటీ తహశీల్దార్ డి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

### రాజోలు భవిత కేంద్రంలో వైద్య పరీక్షల శిబిరం

రాజోలు, మార్చి 28: రాజోలు భవిత కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్షా సహిత విద్యలో భాగంగా రాజోలు, మామిడికుదురు, మలికిపురం, సఖినేటిపల్లి మండలాలకు చెందిన 18 సంవత్సరాల లోపు దివ్యాంగ బాలలకు నిపుణులైన వైద్యులచే వైద్య పరీక్షల నిర్ధారణ శిబిరం మండల విద్యాశాఖ అధికారి ఎస్.మనోహరం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి బి.సుబ్రహ్మణ్యం ముఖ్యఅతిథిగా విచ్చేసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో సమగ్ర శిక్ష సహిత విద్యలో భాగంగా ఏర్పాటుచేసిన ఈ శిబిరాన్ని ఉపయోగించుకుని నిపుణులైన వైద్యులచే నిర్ధారించిన ఉపకరణాలను ఉచితంగా తీసుకుని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సహిత విద్యా కోఆర్డినేటర్ సత్యనారాయణ మాట్లాడుతూ కంటి, చెవి, ఆర్థోపెడిక్‌లకు సంబంధించిన నిపుణులైన వైద్యులు 126 మంది దివ్యాంగ బాలలకు వైద్య పరీక్షలు చేశామన్నారు. కంటికి సంబంధించి కళ్లజోళ్లు, చెవికి సంబంధించి హియరింగ్ ఎయిడ్స్ ఆర్థోపెడిక్‌కు సంబంధించి వీల్‌ఛైర్స్ అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో రాజోలు ఎంఈవో-2 టీఎస్వేడి ప్రసాదరావు, ఐఈఆర్పీలు సుబ్బలక్ష్మి, అనిత పాల్గొన్నారు.

### ఘనంగా కోదండరామస్వామి ఆలయ వార్షికోత్సవం

అంబాజీపేట, మార్చి 28: మాచవరం పరిధిలోని చప్పిడివారి పాలెంలో కోదండరామస్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్న ప్రసాదం స్వీకరించారు.



ఎస్.కొత్తపల్లిలో కూటమి అభ్యర్థులకు హారతి పడుతున్న మహిళలు



కొత్తపేట: వాడపాలెం సమావేశంలో మాట్లాడుతున్న సత్యానందరావు



మామిడికుదురు: ఉమ్మడి పార్టీ అభ్యర్థి గిడ్డి సత్యనారాయణను సత్కరిస్తున్న దృశ్యం

# టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిని గెలిపించండి

• టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థులు హరీష్ మాధుర్, అయితాబత్తుల

ఉప్పలగుప్తం, మార్చి 28: వచ్చే ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమికి ఓటేసి అభివృద్ధి, సంక్షేమాలను గెలిపించాలని అమలాపురం అసెంబ్లీ అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయన అమలాపురం లోక్‌సభ అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్‌తో కలిసి ఎస్.కొత్తపల్లి, నల్లావారిపేట, రాజుపాలెం, కొంకివారిపేట, మార్కెట్ ఏరియా, రాఘవులపేటల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మహిళలు వారికి హారతులు ఇచ్చారు. వైసీపీ నుంచి పలువురు టీడీపీలో చేరారు. టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు అరిగెల నానాజీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, గొలకోటి చిన్నా, లంకే శ్రీనివాస్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు గుత్తుల శ్రీనివాస్, కె.పెద్దిరాజు, ఈదరపల్లి శ్రీనివాసరాజు, మల్లాడి వెంకటరమణ, లంకే భీమరాజు, నల్లా వెంకన్నబాబు, మల్లాడి వెంకటరమణ, బీజేపీ నాయకుడు గనిశెట్టి అరవింద్, జనసేన నాయకులు మహదశ నాగేశ్వరరావు, ఆకుల సూర్యనారాయణమూర్తి, చిక్కం సుధారాణి, చిక్కం సూర్యమోహన్, సూదా చిన్న, కుంపట్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### జగన్ పాలనలో వ్యవస్థలను భ్రష్టుపట్టించారు: బండారు

**కొత్తపేట:** రాష్ట్రంలో జగన్ పాలనలో అన్ని వ్యవస్థలను భ్రష్టుపట్టించారని కొత్తపేట అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి బండారు సత్యానందరావు అన్నారు. గురువారం వాడపాలెంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యవస్థలు సక్రమంగా లేకపోతే ప్రజల్లో అభద్రతా భావం ఏర్పడుతుందన్నారు. ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవస్థలను పటిష్ఠపరచడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు, రైతులు, మహిళలు, అన్ని వర్గాల ప్రజలు స్వేచ్ఛగా హక్కులు పొందేలా సమూల మార్పులు తీసుకువస్తామన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు ఈదల సత్తిబాబు, బండారు వెంకటసత్తిబాబు, మందపల్లి సోమశేఖర్, పడాల అబ్బిరాజు, దంగేటి చంటి, పడాల వెంకటేశ్వరరావు, వెలుగుబంటి వెంకటేశ్వరరావు, దూలం శ్రీనివాస్, దూలం వీరభద్రరరావు, తూము శివ పాల్గొన్నారు.

### వానపల్లిలో వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు

మండలంలోని వానపల్లి గ్రామానికి చెందిన సుమారు 100 మంది గురువారం వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వారికి కొత్తపేట అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి బండారు సత్యానందరావు టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. సర్పంచ్ పల్లి భీమారావు, టీడీపీ మండల నాయకులు, జనసేన నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

### 'టీడీపీతోనే అభివృద్ధి సాధ్యం'

**ఆలమూరు:** గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు అభివృద్ధి టీడీపీ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. గురువారం ఆయన చొప్పెల్లలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉమ్మడి ప్రభుత్వ అధికారంలోకి వచ్చాక చేసే అభివృద్ధిని వివరించారు. సత్యానందరావుకు మహిళలు హారతులు ఇచ్చారు. టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఉమ్మడి అభ్యర్థి విజయానికి కృషి: సత్యనారాయణ

**మామిడికుదురు:** పి.గన్నవరం నియోజకవర్గంలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ విజయానికి కృషి చేస్తామని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. లూటుకుర్రు గ్రామంలో బోనం బాబు ఇంటి వద్ద అసెంబ్లీ అభ్యర్థి పరిచయ కార్యక్రమం గురువారం జరిగింది. ఎమ్మెల్యే అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ టీడీపీ నాయకులు దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గిడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ అందరినీ కలుపుకుని పి.గన్నవరంలో విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మొల్లేటి శ్రీనివాస్, బోనం బాబు, సూదా బాబ్జి, వర్ధినేని బాబ్జి, చుట్టుగుళ్ల కిశోర్, మల్లాడి విష్ణు, జాలెం సుబ్బారావు, గంధం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

### చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి: టీడీపీ నాయకులు

**ముమ్మిడివరం:** సంక్షేమ పథకాల ముసుగులో రాష్ట్రాన్ని దోచుకున్న వైసీపీ ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. గురువారం ముమ్మిడివరం మండలం అనాతవరం గ్రామంలో టీడీపీ-జనసేన పార్టీ ఉమ్మడి మేనిఫెస్టో సూపర్-6 పథకాలను ప్రజలకు వివరించి కరపత్రాలను అందించారు. టీడీపీ-జనసేన పార్టీ కూటమి ద్వారానే రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన సాధ్యమవుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు, పార్లమెంటు అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్‌లను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అనాతవరంలోని భోగాలతోట తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కురసాల శివబాబు, మిమ్మితి చిరంజీవి, గుబ్బల తాతబ్బాయి, వెంకటేశ్వరరావు, మునుకోటి ఏసుబాబు నాయుడు, పెయ్యల వెంకటరమణ, బొక్కా త్రిమూర్తులు, కూనవరపు ఏడుకొండలుతోపాటు పలువురు పాల్గొన్నారు.

### చింతలచెరువులో శంఖారావం

**కాట్రేనికోన:** చింతలచెరువులో గురువారం శంఖారావంలో భాగంగా బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం జరిగింది. ఇంటింటికీ వెళ్లి బాబు సూపర్ సిక్స్ పథకాలపై వివరించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఇసుకపట్ల వెంకటేశ్వరరావు, జనిపెల్ల సోమన్న, ఇసుకపట్ల రాంబాబు, కసిరెడ్డి రాజా, బడుగు పుల్లారావు, కాగిత శ్రీనివాసరావు, నాతి సతీష్, ఇసుకపట్ల గోవిందు, పులుగు సురేంద్రబాబు, ఇసుకపట్ల సత్యనారాయణ, అయితాబత్తుల కృపావరం పాల్గొన్నారు.

### ఉప్పూడిలో టీడీపీ ఎన్నికల ప్రచారం

ఉప్పూడి పంచాయతీ ఉప్పూడి, ఇరమండ, గంటివారిపేటల్లో గురువారం టీడీపీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి అసెంబ్లీ, పార్లమెంటు కూటమి అభ్యర్థులు దాట్ల బుచ్చిబాబు, గంటి హరీష్‌మాధుర్‌లను గెలిపంచాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగిడి నాగేశ్వరరావు, పార్టీ గ్రామ కన్వీనర్ పోలిశెట్టి వీవీ సత్యనారాయణ, సర్పంచ్ రంబాల రమేష్, దొరబాబు, నెల్లి పల్లారావు, జొన్నాడ రాజారావు, రేవు రమేష్, గెద్దాడ శ్రీను, పీటీ వర్మ, అంబేడ్కర్, జనసేన నాయకులు పాల్గొన్నారు.

## 85శాతం హామీలను తుంగలో తొక్కిన వైసీపీ

• తెలుగు మహిళ మీడియా విభాగం రాష్ట్ర కో-ఆర్డినేటర్ పూర్ణిమ



సమావేశంలో మాట్లాడుతున్న పూర్ణిమ

అమలాపురం టౌన్, మార్చి 28: రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన 85శాతం హామీలను తుంగలో తొక్కి మాట తప్పి మడమ తిప్పిన జగన్‌ను ఓడించేందుకు రాష్ట్ర ప్రజలంతా సంసిద్ధంగా ఉన్నారని తెలుగు మహిళ మీడియా విభాగం రాష్ట్ర కో-ఆర్డినేటర్ మాకిరెడ్డి వీఎస్ఎస్ పూర్ణిమ పేర్కొన్నారు. మద్య నిషేధం చేసిన తర్వాతే ఎన్నికల్లో ఓట్లు అడుగుతానని చెప్పి మహిళలను నిలువునా ముంచి మోసం చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. అమలాపురం లోక్‌సభ నియోజకవర్గ స్థాయి తెలుగు మహిళల సమావేశాన్ని మెట్ల రమణబాబు స్వగృహం వద్ద గురువారం నిర్వహించారు. చరిత్రలో ఎన్నడూలేని విధంగా ఐదేళ్ల పాలనలో తొమ్మిదిసార్లు విద్యుత్ చార్జీలను పెంచిన ఘనత వైసీపీదేనన్నారు. జాబ్ క్యాలెండరు లేదు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లేకుండా చేశారని విమర్శించారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించి వారి అభ్యున్నతిని, అభివృద్ధిని అడ్డుకున్నారని ధ్వజమెత్తారు. అన్నిరంగాల్లో మాఫియా ముఠాలు చేరి మాఫియా రాష్ట్రంగా మార్చేశారని ఎద్దేవా చేశారు. ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన జగన్ ప్రభుత్వానికి మహిళలంతా తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని పూర్ణిమ పేర్కొన్నారు. తెలుగు మహిళా నాయకులు గెల్లా మీనాకుమారి, యనమదల లక్ష్మి, పేరూరి విజయలక్ష్మి, పోతుల నాగలక్ష్మి, అప్పారి సుశీల, గుమ్మడి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

### అయినవిల్లి హుండీల ఆదాయం రూ.15.73 లక్షలు

అయినవిల్లి, మార్చి 28: అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వరస్వామి దేవస్థానంలోని హుండీలను దేవదాయ శాఖ జిల్లా అధికారి డి.నాగమల్లేశ్వరరావు పర్యవేక్షణలో గురువారం తెరిచి లెక్కించారు. 35 రోజులకు ప్రధాన హుండీల ద్వారా రూ.15,21,913, అన్నప్రసాద హుండీ ద్వారా రూ.51,596.. మొత్తం రూ.15,73,509 ఆదాయం వచ్చింది. బంగారం 3.1 గ్రాములు, వెండి 240 గ్రాములు, ఇతర దేశాల కరెన్సీ నోట్లు ఆరు వచ్చాయని తనిఖీదారు జె.రామలింగేశ్వరరావు తెలిపారు. లెక్కింపులో ఆలయ అధికారులు, అర్చకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.2.19 లక్షలు

ఆత్రేయపురం, మార్చి 28: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామిని గురువారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.2,19,735 లభించినట్టు ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు.

### పవర్ లిఫ్టింగ్ పోటీలకు శశికళ ఎంపిక



అమలాపురంటౌన్, మార్చి 28: ఇందుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఉందుర్తి శశికళ రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయుడు వి.శ్రీనివాసరావు గురువారం తెలిపారు. 65 కిలోల విభాగంలో ప్రతిభ చాటిన ఆమె ఈనెల 30, 31 తేదీల్లో విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో అండర్-17 విభాగంలో పాల్గొంటుందని హెచ్ఎం తెలిపారు. విద్యార్థిని సర్పంచ్ చొల్లంగి శివాళిని, అప్పాజీ, పీఈటీ బుజ్జి, ఉపాధ్యాయులు, సహచర విద్యార్థులు అభినందించారు.

### 87 మంది ఉద్యోగాలకు ఎంపిక

అమలాపురంటౌన్, మార్చి 28: అమలాపురం రోటరీ క్లబ్ భవనంలో ఆకొండి సింహాచలం సర్వీసు ట్రస్టు ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన అంజనాస్ ఫౌండేషన్ సహకారంతో గురువారం జాబ్‌మేళా నిర్వహించారు. 350మంది హాజరుకాగా వారిలో 87 మందిని వివిధ కంపెనీలు ఉద్యోగాలకు ఎంపిక చేశాయని ట్రస్టు ఛైర్మన్ ఆకొండి పవన్ తెలిపారు. వారికి త్వరలోనే నియామక ఉత్తర్వులు అందజేస్తామన్నారు. జేసీఏ అధ్యక్షుడు ఆకొండి చాణక్య, ఆకొండి రవీంద్ర, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### రేపు గుంటూరులో ఎమ్మార్పీఎస్ సదస్సు

అమలాపురంరూరల్, మార్చి 28: గుంటూరులో శనివారం జరిగే ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ రాష్ట్రస్థాయి కార్యకర్తల సదస్సును విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సవరపు భైరవమూర్తి మాదిగ పిలుపునిచ్చారు. రోళ్లపాలెంలోని నేదునూరి నతానియేలు ప్రాంగణంలో ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకుల సమావేశం నియోజకవర్గ ఇన్‌చార్జి ఆకుమర్తి రమేష్ అధ్యక్షతన గురువారం జరిగింది. మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు లూటుకుర్తి చిన్నా మాట్లాడుతూ భవిష్యత్తు కార్యాచరణపై జరిగే సదస్సులో కార్యకర్తలంతా పాల్గొనాలని కోరారు. నాయకులు సత్తాల దుర్గారావు, పలివెల రాంబాబు, వంగలపూడి నరసింహమూర్తి, మంద దుర్గారావు, ముమ్మిడివరపు మన్యం తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్‌పార్టీతోనే సమగ్రాభివృద్ధి

రావులపాలెం, మార్చి 28: రాష్ట్ర సమగ్రాభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ అన్నారు. గురువారం ఆయన మండలంలోని ఈతకోటలో బూత్ కమిటీ నాయకులతో సమావేశం నిర్వహించారు. పీసీసీ ఉపాధ్యక్షుడు ముషిణి రామకృష్ణరావు, ప్రధాన కార్యదర్శి మాచవరపు శివన్నారాయణ, అమలాపురం పట్టణ శాఖ అధ్యక్షుడు ఒంటెద్దు బాబి, నాయకులు రౌతు ఈశ్వరరావు, పల్లి హరిశ్చంద్రప్రసాద్, ఎం.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### విశ్వశాంతి మహా యాగం

ఉప్పలగుప్తం, మార్చి 28: విలసవిల్లిలో మూడు రోజుల పాటు జరిగే విశ్వశాంతి మహాయాగం గురువారం ప్రారంభమైంది. తొలి రోజు గణపతి పూజ, పుణ్యాహవాచనం, దీక్షాధారణ, యాగశాల ప్రవేశ పూజలు జరిగాయి. కాకినాడకు చెందిన మాల్యాల ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పిరిట్యువల్ సైన్సెస్ అండ్ చారిటీస్ సౌజన్యంతో ముప్పంగి రామకృష్ణశర్మ, పండితబృందం ఆధ్వర్యంలో యాగాన్ని జరుపుతున్నారు.

### మండల బీజేపీ యువమోర్చా అధ్యక్షులుగా వాసు, సూర్య



మలికిపురం, మార్చి 28: మలికిపురం మండలం బీజేపీ యువమోర్చా అధ్యక్షులుగా గుడిమెళ్లంకకు చెందిన కట్టా వాసు, శంకరగుప్తానికి చెందిన ఆచంట సూర్యజగదీష్‌నాయుడులను నియమిస్తూ మండల బీజేపీ అధ్యక్షుడు కాపిశెట్టి కనకేశ్వరరావు గురువారం నియామక పత్రాలు అందించారు. యువమోర్చా బలోపేతం కోసం పనిచేస్తామని వారు అన్నారు. తమ నియామకానికి సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

### మిథిల్‌కుమార్ జైన్‌కు జనసేనాని కీలక బాధ్యతలు

రామచంద్రపురం,(ద్రాక్షారామ) మార్చి 28: రామచంద్రపురం పట్టణానికి చెందిన మిథిల్‌కుమార్ జైన్‌కు జనసేన అధ్యక్షుడు భద్రతాపరమైన చర్యలు సమన్వయం బాధ్యతలు అప్పగించింది. ఈనెల 30 నుంచి జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఎన్నికల ప్రచారంలో భద్రతా సంబంధిత వ్యవహారాలపై సమన్వయం చేసే బాధ్యతను మిథిల్‌కుమార్‌జైన్, అందే నరేన్‌లకు అప్పగిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి రాజకీయ కార్యదర్శి పి.హరిప్రసాద్ ఉత్తర్వులు ఇచ్చారు. తనకు అప్పగించిన బాధ్యతలు చిత్తశుద్ధితో నిర్వహిస్తానని మిథిల్‌కుమార్ జైన్ తెలిపారు.

### యానాంలో పుదుచ్చేరి సీఎస్ పర్యటన



పుదుచ్చేరి సీఎస్ శరత్ చౌహాన్‌కు స్వాగతం పలుకుతున్న ఆర్ఏ మునిస్వామి

యానాం, మార్చి 28: పుదుచ్చేరి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శరత్ చౌహాన్‌కు యానాం అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా ఆయన యానాం వచ్చారు. ఇటీవల పుదుచ్చేరి సీఎస్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారి యానాం పర్యటనకు వచ్చారు. పుదుచ్చేరి నుంచి రాజమండ్రి చేరుకున్న సీఎస్ చౌహాన్‌కు యానాం పరిపాలనాధికారి ఆర్.మునిస్వామి, రాజమండ్రి ఆర్డీవో తదితర అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం రాజమహేంద్రవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల, పలు ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించారు. అధికారులు వీరికి ఘన స్వాగతం పలికారు. విద్యార్థులతో అధ్యాపకులతోనూ ఆయన మాట్లాడి విద్యావిధానం తదితర అంశాలపై చర్చించారు. అనంతరం యానాం చేరుకున్నారు.

### అగ్ని ప్రమాదంలో తాటాకిల్లు దగ్ధం



అంబాజీపేట, మార్చి 28: పుల్లేటికుర్రు శివారు వాజ్‌పాయ్ కాలనీలో గురువారం అగ్ని ప్రమాదం సంభవించింది. గాడా నాగబాబు ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలి ఒక్కసారిగా మంటలు చేలరేగాయి. గృహోపకరణాలు, నాగబాబు కుమార్తె పెళ్లికోసం దాచిన 12 గ్రాముల బంగా రం, రూ.2.80లక్షల నగదు అగ్నికి ఆహుతయ్యాయి. అమలాపురం అగ్నిమాపకాధికారి కేవీ కొండబాబు సిబ్బందితో మంటలను అదుపుచేశారు. బాధితులను సర్పంచ్ జల్లి బాలరాజు పరామర్శించారు.

### తాటాకిల్లు దగ్ధం..

అమలాపురం రూరల్, మార్చి 28: రోళ్లపాలెం గున్నాపంతుల అగ్రహారంలో ముషిణి నాగేశ్వరరావుకు చెందిన తాటాకింట్లో ముషిణి సత్యనారాయణ కుటుంబం అద్దెకు ఉంటుంటోంది. గురువారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో ఒక్కసారిగా మంటలు ఎగసిపడ్డాయి. ఇంటి నిర్మాణం కోసం బ్యాంకు నుంచి తీసుకువచ్చిన లక్షలాది రూపాయల నగదు, బంగారం, వెండి ఆభరణాలు అగ్నికి ఆహుతయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు.

### ఘనంగా వివేకానంద పాఠశాల వార్షికోత్సవం

రామచంద్రపురం(ద్రాక్షారామ), మార్చి 28: రామచంద్రపురం పట్టణంలో వివేకానంద ఉన్నత పాఠశాల ప్రథమ వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. చిన్నారులు వేషధారణలతో ఆకట్టుకున్నారు. జెఎన్‌టీయూ ప్రొఫెసర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ, కరస్పాండెంట్ బీఏఎస్ సరోజిని తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో పాఠశాల ఈడీ సీహెచ్ సైలూష, సీహెచ్.వికాస, పాఠశాలల డైరెక్టరు సీహెచ్. వెంకటేశ్వరరావు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### ఇమాం హసన్ జయంతి

ద్రాక్షారామ, మార్చి 28: మహమ్మద్ ప్రవక్త పెద్దమనుమడు ఇమాంహసన్ జయంతి గురువారం ఘనంగా నిర్వహించారు. ఇదారే ఇమాం రజాలో ఉర్దూ చదువుకున్న బాలబాలికలకు బహుమతులు ఇదారా ఇమాం రజా పాలకవర్గం అందజేశారు. మౌలానా అస్కరి హుస్సేన్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.



### 8వ వార్డులో సూర్యప్రకాష్ పర్యటన

రామచంద్రపురం(ద్రాక్షారామ), మార్చి 28: రామచంద్రపురం పట్టణంలో 8వ వార్డులో వైసీపీ అభ్యర్థి పిల్లి సూర్యప్రకాష్ గడగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు.వంతెన వద్ద గ్యాస్ గొడౌన్ వద్ద నుంచి పర్యటన ప్రారంభించి ఇంటింటి ప్రచారం చేశారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, వైస్‌ఛైర్మన్ కొలమూరి శివాజీ, నాగేశ్వరరావు, కౌన్సిలర్ భద్రరావు పాల్గొన్నారు.

### అన్ని సామాజికవర్గాలకు ఉచిత పాలిటెక్నిక్ శిక్షణ



గుబ్బల మురళీకృష్ణ

మామిడికుదురు, మార్చి 28: పాలిటెక్నిక్ ఎంట్రన్స్ పరీక్షకు హాజరయ్యే అన్ని సామాజిక వర్గాల విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు ఆంధ్రప్రదేశ్ బీసీ, ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గుబ్బల మురళీకృష్ణ తెలిపారు. 2024 మార్చి నెలలో 10వ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు పాలిటెక్నిక్, ఏపీఆర్జేసీ, కెరియర్ గైడెన్స్‌పై జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో శిక్షణ ఇచ్చి ఉచిత స్టడీ మెటీరియల్ అందిస్తామని తెలిపారు. ఈ శిక్షణా తరగతులు ఏప్రిల్ 2వ తేదీ నుంచి మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమవుతాయని తెలిపారు.

### 'శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి'

ముమ్మిడివరం, మార్చి 28: ఎన్నికలు సజావుగా సక్రమంగా జరిగేందుకు అందరూ సహకరించాలని ముమ్మిడివరం సీఐ ఎన్.కొండయ్య విజ్ఞప్తి చేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతా పరిరక్షణలో భాగంగా గురువారం ముమ్మిడివరం మండలం అయినాపురం చిట్టిచెరువు, సోమిదేవరపాలెం, క్రాపచింతలపూడి, క్రాపచింతలపూడిపాలెం గ్రామాల్లో సీఐఎస్ఎఫ్ సిబ్బందితో పోలీసు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ కొండయ్య మాట్లాడుతూ ప్రజలు స్వచ్ఛందంగా ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.కార్యక్రమంలో ఎస్ఐ టి.సురేష్‌బాబు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

### హుండీల ఆదాయం రూ.4.81 లక్షలు

ఆత్రేయపురం, మార్చి 28: పురాణ ప్రసిద్ధిగాంచిన ర్యాలి జగన్మోహినీకేశవ స్వామి ఆలయంలోని హుండీలను పర్యవేక్షణాధికారి మీసాల రాధాకృష్ణ ఆధ్వర్యంలో గురువారం తెరిచి లెక్కించారు. మూడు నెలలకు రూ.4,81,256 ఆదాయం లభించింది. ఉమాకమండలేశ్వరస్వామి ఆలయానికి రూ.1,25,966 ఆదాయం లభించినట్టు ఈవో కృష్ణచైతన్య తెలిపారు. స్వామివారి అన్నప్రసాద ట్రస్టుకు రాజమహేంద్రవరానికి చెందిన కాకర్ల రామకృష్ణ పరమహంస రూ.25,116 విరాళం ఇచ్చినట్టు ఈవో చెప్పారు.

### 'సిద్ధార్థ' విద్యార్థుల ప్రతిభ

రావులపాలెం, మార్చి 28: హైదరాబాద్‌కు చెందిన ఎడ్యుకేషన్ అకాడమీ నిర్వహించిన ఒలంపియాడ్‌లో స్థానిక శ్రీసిద్ధార్థ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచారని సిద్ధార్థ విద్యా సంస్థల డైరెక్టర్ కె.ముల్లారావు తెలిపారు. పాఠశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను ఆయనతోపాటు ఏవో ప్రభాకర్‌రెడ్డి, ప్రిన్సిపల్ ఆశీర్వాదం, అనీల అభినందించారు.

### విశ్వరూప్ ప్రచారం

అల్లవరం, మార్చి 28: మండలంలోని తాడికోన, గూడాల గ్రామాల్లో అమలాపురం అసెంబ్లీ వైసీపీ అభ్యర్థి పినిపె విశ్వరూప్ గురువారం ఇంటింటా ప్రచారం చేశారు. ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జడ్పీటీసీ కొనుకు గౌతమి, కొనుకు బాపూజీ, తిక్కా వెంకటప్రసాద్, దాకారపు చిరంజీవిరావు, సాధనాల వెంకటసూర్యనాగమణి, సాధనాల వెంకట్రావు, వంటెద్దు వెంకన్ననాయుడు, చెల్లుబోయిన శ్రీనివాస్, తిక్కిరెడ్డి శ్రీనివాస్, శిరంగు వీరబాబు, దాసరి అప్పలస్వామి, ఉంద్రు బాబ్జీ, నాతి శ్రీను, జల్లి సత్యనారాయణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

### పదో తరగతి పరీక్షలు ప్రశాంతం

ముమ్మిడివరం, మార్చి 28: జిల్లాలో పదో తరగతి సంస్కృతం పరీక్ష గురువారం ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలోని 42 పరీక్షా కేంద్రాల్లో 2,109 మంది హాజరుకావాల్సి ఉండగా 2,096 మంది విద్యార్థులు హాజరయ్యారు. 13 మంది గైర్హాజరైనట్టు డీఈవో ఎం.కమలకుమారి తెలిపారు. డీఈవో కమలకుమారి మూడు పరీక్షా కేంద్రాలను, అసిస్టెంట్ కమిషనర్ ఎన్.సురేష్ మూడు పరీక్షా కేంద్రా లను, డీవైఈవో ఎన్.ఫణి మూడు పరీక్షా కేంద్రాలను పరిశీలించారు.

### ఆర్టీసీ బస్టాండ్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి

మండపేట, మార్చి 28: మండపేట ఏడిద రోడ్డులో వున్న ఆర్టీసీ బస్టాండ్‌లో గురువారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మండపేట పట్టణ పోలీసుల కథనం ప్రకారం మండపేట ఏడిదరోడ్డులో వున్న బస్టాండ్‌లో గుర్తు తెలియని 40 సంవత్సరాల వ్యక్తి మృతి చెందాడని వీఆర్వో నాగూరు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్.ఐ నాంచారయ్య చెప్పారు.

### 'కాపు కల్యాణ మండపానికి జగ్గిరెడ్డి నిధులిచ్చారా?'



సమావేశంలో మాట్లాడుతున్న కాపు నాయకులు

ఆలమూరు, మార్చి 28: ఆలమూరులో కాపు కల్యాణ మండపం నిర్మాణానికి టీడీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి తాను రూ.50 లక్షలు మంజూరు చేయించానని చెప్పడం విడ్డూరంగా ఉందని స్థానిక కాపు నాయకులు పేర్కొన్నారు. గురువారం వారు మీడియాతో మాట్లాడారు. గత ఏడాది ఆగస్టులో రూ.15 లక్షలు మంజూరు చేస్తున్నట్టు చెప్పి జడ్పీ కాపీని జగ్గిరెడ్డి అందించారని, ఎనిమిది నెలల తర్వాత అడిగితే ఎన్నికల కోడ్ వచ్చిందని చెప్పడం ఎంతవరకు న్యాయమని ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని, వైసీపీ నాయకుడు చల్లా ప్రభాకరరావుని ప్రశ్నించారు. 2015లో టీడీపీ హయాంలో బండారు సత్యానందరావు కాపు కార్పొరేషన్ ద్వారా రూ.50 లక్షలు, పంచాయతీ ద్వారా 40 సెంట్ల స్థలాన్ని కేటాయింపు చేసిన సంగతి అందరికీ తెలిసిందేనన్నారు. ఈ విషయాన్ని పక్కన పెట్టి తామే చేయించామని చెప్పడం విడ్డూరమన్నారు. వాస్తవాలు చెప్పాలని హితవుపలికారు. సమావేశంలో రామానుజుల శేషగిరిరావు, మానేపల్లి శ్రీనువాస్, శిరిగినీడి పట్టాభి, చల్లా వెంకటేశ్వరరావు, చల్లా సత్తిబాబు, చల్లా ఉదయం, కొమ్మిశెట్టి మాలక్ష్మి పాల్గొన్నారు.

### రాజోలు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సాయిబాబు

రాజోలు, మార్చి 28: రాజోలు బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా మామిడిశెట్టి సాయిబాబు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా చింతా ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా గొల్లమందల స్టాలిన్, కోశాధికారిగా వీవీ నాగేశ్వరరావు, సంయుక్త కార్యదర్శులుగా సిర్రా వెంకటేశ్వరరావు, గుబ్బల రజిత, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా బి.ప్రేమ్‌కుమార్, జి.సత్యనారాయణలు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా సీనియర్ న్యాయవాది జాలెం భాస్కర్ వ్యవహరించారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను సీనియర్ న్యాయవాదులు వాడ్రేవు పాపయ్యపంతులు, వీవీ కృష్ణంరాజు, పొన్నాడ సూర్యారావు, ఆకుల భాస్కరరావు, ఎం.శ్రీనివాసరావు, కోట సుధాకర్, దొంగ రామ్మోహనరావు, ఎస్.సత్యనారాయణలు శుభాకాంక్షలు తెలిపారు.

### అనుమతులు లేని నిర్మాణం తొలగింపు

ముమ్మిడివరం, మార్చి 28: ముమ్మిడివరం నగర పంచాయతీ 11వ వార్డు కొండాలమ్మచింత సమీపంలో ఒక ప్రైవేటు పాఠశాలపై అనధికారికంగా చేపట్టిన నిర్మాణాన్ని ముమ్మిడివరం నగర పంచాయతీ అధికారులు గురువారం అడ్డుకున్నారు. ఎటువంటి అనుమతులు పొందకుండా ఒక ప్రైవేటు పాఠశాలపై మరో అంతస్తు నిర్మాణానికి సెంట్రింగ్‌ను ఏర్పాటుచేయగా టౌన్ ప్లానింగ్ అధికారి కె.మంజుల ఆధ్వర్యంలో నగర పంచాయతీ సిబ్బంది వాటిని తొలగించారు. ఆ భవన యజమానికి పలుసార్లు హెచ్చరికలు జారీచేసిన వాటిని ఖాతరు చేయకుండా నగర పంచాయతీ ముందస్తు అనుమతి లేకుండా నిర్మాణం చేపట్టడంతో సెంట్రింగ్‌ను తొలగించాల్సి వచ్చిందని కమిషనర్ జి.వెంకట్రామిరెడ్డి తెలిపారు.

### ఎన్‌సీసీ క్యాడెట్‌లకు ఓటుపై అవగాహన

రామచంద్రపురం(ద్రాక్షారామ), మార్చి 28: రామచంద్రపురం పట్టణంలో వీఎస్ఎం కళాశాలలో ఎన్‌సీసీలో నేవీ, ఆర్మీ క్యాడెట్‌లు స్వీప్ యాక్టివిటీస్‌లో భాగంగా గురువారం ర్యాలీ నిర్వహించారు. ఓటు ఆవశ్యకత వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, సీఐ, ఎస్ఐ, తదితరులు పాల్గొన్నారు.

#### ఉన్నత స్థితికి చేరుకోవాలి

ఎన్‌సీసీ క్యాడెట్‌లు కష్టపడి విద్యాభ్యాసం చేసి చెడువ్యసనాలకు దూరంగా ఉంటూ ఉన్నతస్థితికి చేరుకోవాలని సీఐ దొరరాజు అన్నారు. గురువారం ఎన్‌సీసీ క్యాడెట్‌లకు భవిష్యత్తుపై దిశానిర్దేశం చేశారు. ఉన్నత స్థానాలకు చేరుకునేందుకు విద్య ఒక్కటే మార్గమన్నారు.

### సకల జీవకోటికి నీరే ఆధారం

యానాం, మార్చి 28: సకల జీవ కోటికి నీరే ఆధారమని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ అన్నారు. జనవిజ్ఞాన వేదిక ప్రపంచ జలదినోత్సవం దశ దినోత్సవాల్లో భాగంగా యానాం గిరియంపేట పెరుంతలైవర్ కామరాజర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు దంగేటి త్రిమూర్తులు అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో ముఖ్యవక్తగా జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ మాట్లాడారు. ప్రస్తుతం రాష్ట్రాల మధ్య నీటి తగాదాలు తీవ్రస్థాయికి చేరుకున్నాయన్నారు.